క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ట, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో జీకే ఫౌండేషన్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.19.14 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు.. పర్యవేక్షిస్తున్న అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల ఆధ్వర్యంలో హుండీల ఆదాయం లెక్కించారు. అమ్మవారి దర్శనాలకు సంబంధించి 60 రోజులకు గాను రూ.19,14,187 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామూర్తి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి సూచించారు. ఆశీలమెట్టలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలో ఓవర్ లోడ్, సైడ్ సీట్‌లో ప్రయాణికులను కూర్చోబెట్టడం వంటివి చేయకూడదన్నారు. ట్రాఫిక్ రూల్స్, మెయిన్ రోడ్డులో సిగ్నళ్ల వద్ద డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలు తెలుగువారి సంపదని, భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు ఎల్లప్పుడూ మనం వింటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా బాలు నటించిన మిధునం చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జీ, అనూరాధ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



అమ్మవారికి పారామాత్మిక హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



పవిత్రోత్సవాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజాధికాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి విష్వక్సేన, పుణ్యాహవచన, పంచవ్యారాధన, పంచాగవ్యాప్రాశన, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్టాపన, ప్రధాన హోమాలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి అగ్నిధ్యానం, ప్రధాన హోమాలు, పంచకుంభ ఆరాధన, పవిత్ర అభిమంత్రణ, పారామాత్మిక హోమం, చతుర్వేద పారాయణం తదితర పూజల చేశారు. పూజా కార్యక్రమాలన్నీ దేవస్థాన వేద పండితులు, అర్చకుల పర్యవేక్షణలో పెదపూడి రఘురామ్(విజయవాడ) నిర్వహించారు.

నేడు అంతరాలయ దర్శనాలు రద్దు

పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు నిలిపివేయనున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆ సమయంలో నిర్వహించే పంచామృతాభిషేకం నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని బయట నుంచే దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు సత్యరూపవాణి, వి.మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, సహాయ ఈవో కె.రాజేంద్రకుమార్, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్దన్ కృషి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి
- ఏజీ బర్దన్ శత జయంతి వేడుకలు ప్రారంభం



ఏబీ బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు

అల్లిపురం: దివంగత సీపీఐ జాతీయ కార్యదర్శి ఏబీ బర్దన్ శత జయంతి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బర్దన్ చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్దన్ విశేష కృషి చేశారన్నారు. ఈ శత జయంతి వేడుకలు ఏడాది పొడవునా నిర్వహిస్తామన్నారు. సభలు, సదస్సులు, చర్చాగోష్టి, తదితర కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఏబీ బర్దన్ కార్మిక సంఘాల బలోపేతానికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జీఎస్‌జే అచ్యుతరావు, ఎం.మన్మథరావు, సమితి సభ్యులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై కేంద్ర మంత్రితో చర్చ



కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాలాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: ఒక్క రోజు పర్యటన నిమిత్తం సోమవారం నగరానికి విచ్చేసిన కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలాతో ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ సమావేశమయ్యారు. మత్స్య పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సమక్షంలో కేంద్ర మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. మోదీ ప్రభుత్వం ప్రత్యేక మత్స్య మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినందుకు, రూ.20,000 కోట్లు ఐదేళ్లకు కేంద్ర బడ్జెట్‌లో మత్స్య పరిశ్రమకు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునీకీకరణకు రూ.160 కోట్లతో ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని, ఈ పనులు జరుగుతున్న క్రమంలో మత్స్యకారులకు అదనంగా వసతులు కల్పించడానికి మరో రూ.15 కోట్ల డీపీఆర్ అమలు కావాల్సి ఉందని, కేంద్ర మత్స్య శాఖ ద్వారా అందించాలని కోరారు. మత్స్యకారులందరికీ ప్రధాన మంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని, పీఎం మత్స్య సంపద యోజన పథకం కింద రాయితీలు కల్పించాలని, కేజ్ కల్చర్‌కు సంబంధించి మేత, చేప పిల్లలను ఉచితంగా అందించాలని, డీజిల్‌పై సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం అందించాలని పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని పర్షోత్తమ్‌కు జానకీరామ్ అందించారు. రూ.15 కోట్ల నిధుల మంజూరుకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. వచ్చే నెలలో మత్స్యకారులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని పర్షోత్తమ్ రూపాలా చెప్పారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు గుంటూరు దానయ్య, ఇతర నాయకులు దూడ పోలయ్య, పీరుపల్లి ధన, మత్స్యకార నాయకులు బడే ఎల్లాజీ, దానేష్, ఉమ్మడి సుజాత, వాసుపల్లి శ్రీహరి, సురాడ రాజు, ధోని నాగరాజు తదితరులు ఉన్నారు.

నవ్య ఆలోచనల కోసం ప్రపంచం అన్వేషణ

- భవిష్యత్ సమస్యలకు యువతే పరిష్కారం చూపాలి
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచమంతా యువత నుంచి వచ్చే నవ్య ఆలోచనల కోసం అన్వేషిస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన హ్యాకథాన్-2023ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ సమస్యలకు యువతే పరిష్కారాలు చూపాలని సూచించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా హ్యాకథాన్‌లకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. నేడు కోడింగ్‌లో విధానంలో యంత్రాల ప్రభావం పెరిగిపోతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించే సమయంలో నూతన విధానాలతో పని చేయాలని సూచించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూలో నూతనంగా 'ఏయూ కోడియం'ని ప్రారంభిస్తామని వీసీ ప్రకటించారు. హ్యాకథాన్‌లో పాల్గొనే విద్యార్థులకు మార్గదర్శనం అందించే విధంగా ఇది పని చేస్తుందన్నారు. దీనిలో వర్సిటీ ఆచార్యులను సమన్వయకర్తగా నియమిస్తామని, పరిశ్రమల నిపుణులు సలహాదారులుగా ఉంటూ మార్గనిర్దేశం చేస్తారన్నారు. దీనిని పూర్తిస్థాయిలో విద్యార్థులే నిర్వహిస్తారని ప్రకటించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వైవిధ్య ఆలోచనలతో పని చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు వేదికగా నిలుస్తాయన్నారు. సృజనాత్మకంగా పనిచేస్తూ ఇచ్చిన సమస్యలకు సమాధానాలు అన్వేషించాలన్నారు. పోటీల్లో పాల్గొంటున్న 36 టీంలు కేంద్రం సూచించిన సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు, ఐటీ విభాగాధిపతి ఆచార్య కె.నాగేశ్వరరావు, ఆచార్య కె.రాంజీ, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

ఏయూ క్యాంపస్: వైద్య విధానంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని వైద్య, ఆరోగ్య విభాగం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాసుందరి అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని ప్రభుత్వ ఛాతీ, అంటు వ్యాధుల ఆస్పత్రిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకిత భావంతో పని చేస్తూ గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. జీసీసీడీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఫార్మాసిస్టుల విధులు చాలా లోతైన మూలాలు కలిగి ఉన్నాయన్నారు. పీహెచ్‌సీలలో వారి విధులు మరింత బాధ్యతతో కూడినవిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మాసిస్టులు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా కేడర్‌లో ఉన్న ఫార్మాసిస్టులు జోనల్ కేడర్‌గా రూపాంతరం చెందడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ ఫార్మాసిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పలనాయుడు, ఫార్మాసిస్ట్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధులు కోటేశ్వరరావు, బి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 30 వరకూ ఫీజు గడువు

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్న ప్రైవేట్ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు ఫీజు చెల్లించి, కళాశాలలో తరగతులకు హాజరుకావడానికి ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 04, యూసీడీకి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై అపస్మారక స్థితిలో మహిళ

- ఆర్పీఎఫ్, ఏయూటీడీ సహకారంతో కేజీహెచ్‌కు తరలింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న సుమారు 50 ఏళ్ల వయసు గల మహిళను సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి ఏయూటీడీ సహకారంతో కేజీహెచ్‌లో చేర్పించారు. రైల్వే స్టేషన్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ మహిళ మాట్లాడలేని, ఆరోగ్యం సరిగా లేని, బలహీన స్థితిలో పడి ఉంది. ఆర్పీఎఫ్ సిబ్బంది గమనించి ఏయూటీడీ సంస్థకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమె దుస్తులు మార్చి అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు.

ఏయూ సమాచారం..

'ఆదర్శాల అధ్యయనమే తత్త్వశాస్త్రం'

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తత్త్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ ఆచార్య కె.సచ్చిదానందమూర్తి శత జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సచ్చిదానందమూర్తి విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశానికి పిలాసఫీ - రెలిజీయస్ స్టడీస్ శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆదర్శాల అధ్యయనమే తత్త్వశాస్త్రమని, భారతదేశ తత్త్వదర్శనాన్ని ప్రపంచానికి తెలియజేసిన గొప్ప దార్శనికుడు సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య పి.జార్జి విక్టర్, సీనియర్ ఆచార్యులు ఎం.వి.కృష్ణయ్య, ఐసీపీఆర్ సీనియర్ ఫెలో ఆచార్య కె.ఆర్.రజని, బీవోఎస్ ఛైర్మన్ డాక్టర్ బూసి వెంకటస్వామి, యోగాచార్యులు ఆచార్య కె.రమేష్ బాబు, ఆచార్య బి.రవిబాబు, ఆచార్య జి.వీర్రాజు, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి



ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో మాట్లాడుతున్న ఏయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హరనాథ్

మద్దిలపాలెం: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య ఎస్.హరనాథ్ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన జాతీయ సేవా పథకం దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సేవా పథకంలో యువతీ, యువకులు పాల్గొనాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమమహేశ్వరరావు, టి.శ్యామ్యూల్ డేవిడ్ రాజు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నిర్మూలన అందరి బాధ్యత

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి పయనం



కార్యాలయానికి వెళ్లేందుకు బస్ బేలో వేచి ఉన్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు విన్నారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో మేయర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులను వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా సూచించాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

విశేషంగా అన్నసమారాధనలు



సెబాస్టియన్ కాలనీలో అన్నదానం చేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్



అడివమ్మ సందులో అన్నదానం ప్రారంభిస్తున్న మన్యాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధనలు విశేషంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 29వ వార్డు అడివమ్మ సందులో ఆంథోనీనగర్ యూత్ బాయ్స్, స్థానిక మహిళలు ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద సోమవారం మహా అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ వరసిద్ధి వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, యూత్ బాయ్స్ పాల్గొన్నారు.

సెబాస్టియన్ కాలనీలో 4 వేల మందికి..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్ కాలనీలో బాలగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ ప్రారంభించారు. సుమారు 4 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకుడు గర్రాపు సాయిశేఖర్ తెలిపారు. బుధవారం గణపతి నిమజ్జనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆనంద్, దమర్సింగ్ శ్రీను, గోవింద్, బ్రహ్మాజీ, సిమ్మా, లక్ష్మి, కనక, గిరి, కనకమహాలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో..

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో ఏసీడీసీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని డీసీసీబీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బోటు ఓనర్లు, ఆపరేటర్లు, సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

ఘనంగా రాధిక కృష్ణల మహోత్సవం



శివకుమార్, రాధికలను అభినందిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం రాధిక కృష్ణల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ రేనికుంట శ్రీనివాస్ మాట్లాడారు. తమ క్లబ్స్ రీజనల్ ఛైర్‌పర్సన్ మామిడి శివకుమార్, ఫస్ట్ లేడీ ఆఫ్ ది రీజియన్ మామిడి రాధికల మహోత్సవం జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో క్లబ్స్ డిస్ట్రిక్ట్ అబ్జర్వర్ పి.లక్ష్మీగుప్తా, రీజినల్ సెక్రటరీ శివకుమార్, పి.రమేష్, పి.శ్రీరామ్మూర్తి, దుర్గా కృష్ణారావు, కార్యక్రమ కో ఆర్డినేటర్ వంకాయల జవహర్, వంకాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



ధర్నా చేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: మద్దిలపాలెం ప్రభుత్వ కృష్ణ డిగ్రీ కాలేజీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. ఏఐడీఎస్‌వో విశాఖ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర కార్యదర్శి బి.సంతోష్ మాట్లాడుతూ కృష్ణ కాలేజీలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు.

- చిన్నారులు, మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలని కోరుతూ పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహిళలపై హింస ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.
- పలు సమస్యలపై ఫ్యాప్టో ఉపాధ్యాయులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఫ్యాప్టో రాష్ట్ర కో-కన్వీనర్ జోజిబాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కారించాలని, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

నేడు వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన సోమవారం ఉదయం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆంధ్రా యూనివర్సిటీ, ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వీసీ తెలిపారు. అంబేడ్కర్ చైర్ కార్యాలయంలో ఆచార్యులకు ఈసీజీ, ఎకో, బ్లడ్ షుగర్, బీపీ, స్పెషలిస్ట్ వైద్యులతో కన్సల్టేషన్ వంటివి ఈ ఆరోగ్య శిబిరంలో ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జరగనుంది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.